క్లుప్తంగా

చిట్టిబాబుకు జాతీయ స్థాయి అవార్డు



విజయనగరం టౌన్: పేదల అభ్యున్నతికి చేసిన విశేష కృషికి గాను జాతీయ స్థాయి అందజేసే ప్రతిష్టాత్మక భారతరత్న సుబ్రహ్మణ్యం అవార్డు డీబీఏ స్‌యూ చిట్టిబాబును వరించింది. ఈ అవార్డుకు సంబంధించి 2024–25 ఏడాదికి గాను భారత్‌లో 14 మందిని ఎంపిక చేయగా వారిలో చిట్టిబాబు ఒకరు కావడం విశేషం. గత 20 ఏళ్లుగా దళితులు, ఆదివాసీలు, బహుజనుల జీవితాలను మార్చేందుకు చేస్తున్న కృషికి గాను ఈ గౌరవం దక్కింది. మే 22వ తేదీన న్యూఢిల్లీలో ఇండియన్ హేబిటేషన్ కేంద్రంలో ఈ అవార్డు అందజేస్తారని సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. వెనుకబడిన జిల్లా నుంచి చిట్టిబాబును ఆ అవార్డు వరించడం పట్ల అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.71 లక్షలకు జీడిమామిడి ఫలసాయం వేలం ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న తహసీల్దారు గోవింద్

పూసపాటిరేగ: తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని పెదబత్తినివలస గ్రామంలోని జీడిమామిడి ఫలసాయం వేలంపాట మంగళవారం నిర్వహించారు. తహసీల్దారు గోవింద్, ఎంపీడీవో ఎం.రాధిక ఆధ్వర్యంలో మొత్తం 28.15 ఎకరాల్లోని పంటకు సంబంధించి వేలం జరగగా, అదే గ్రామానికి చెందిన పల్లా సింహాచలం రూ.1.71 లక్షలకు వేలంపాడి ఫలసాయం దక్కించుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సత్యారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ స్టేడియంలో పరిశుభ్రతా చర్యలు



స్టేడియం పరిసరాల పరిశుభ్రతలో పారిశుధ్య సిబ్బంది

విజయనగరం: నగరంలోని రాజీవ్ స్టేడియంలో పరిశుభ్రతా చర్యలు మంగళవారం చేపట్టారు. చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు పిచ్చిమొక్కలు తొలగించారు. శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, అటువంటి క్రీడలకు ఆతిథ్యమిచ్చే స్టేడియానికి వచ్చే క్రీడాకారులకు శుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఉందని కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి అన్నారు. స్టేడియానికి వచ్చే వారు కూడా చెత్తాచెదారాన్ని అక్కడి చెత్తబుట్టల్లోనే వేయాలని సూచించారు.

అన్నదానం



ప్రేమసమాజంలోని వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాత

విజయనగరం: స్థానిక పూల్‌బాగ్‌లోని ప్రేమసమాజంలో వృద్ధులకు బొత్స తిరుమలరావు అనే వ్యక్తి మంగళవారం అన్నదానం చేశారు. తన తల్లి బొత్స శాంతమ్మ 17వ వర్ధంతి పురస్కరించుకుని, ఆమె జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టామని ఆయన తెలిపారు. భోజనాలతో పాటు దుప్పట్లు, తువ్వాళ్లు, పండ్లు కూడా అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సౌజన్యశ్రీ, నిత్య, సనాతన్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



రాజరాజేశ్వరిదేవికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశాఖ బహుళ అష్టమి సందర్భంగా జరిగిన ఈ పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, దైవం పట్ల ఉన్న భక్తిశ్రద్ధలు కనబరిచారు. భక్తులంతా ఘటాలు, ప్రభలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



భోగాపురం: ముక్కాం బ్రిడ్జ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల నిరసన



నెల్లిమర్ల: మండల కేంద్రంలోని విద్యుత్ స్టోర్స్ వద్ద కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కార్మికులు

కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ కార్మికులు నిరసనకు దిగారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగా తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందివ్వాలని, 8 గంటల పని పకడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, మూతపడిన పరిశ్రమలు తెరవాలని డిమాండ్ చేశారు. కర్షకుల సంక్షేమం విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే ప్రధాని మోదీ విధానాలను ఖండిస్తూ జూలై 9న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు.

– భోగాపురం, నెల్లిమర్ల

పకడ్బందీగా 'యోగాంధ్ర' నిర్వహించండి



కార్యక్రమంపై దిశానిర్దేశం చేస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు. నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో ఈ నెల 21వ తేదీన ఉదయం 7 గంటలకు యోగాంధ్ర కార్యక్రమం ప్రారంభం కానుందని ఆయన తెలిపారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయంలో ప్రతిరోజూ యోగా సంబంధిత కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం వంటి పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేయాలన్నారు. వృద్ధులతో కూడా ఒకరోజు యోగా చేయించాలన్నారు. మూడు, నాలుగు తరాలకు చెందిన కుటుంబ సభ్యులతో యోగా చేయించేలా చూడాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సచివాలయ కార్యదర్శులు

ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జగన్

వేపాడ: మండలంలోని మారిక గ్రామాన్ని, భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగించే విషయంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించి, పరిగణలోకి తీసుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు. ఇదే విషయమై ఆయన మండలంలోని జాకేరు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసుకు గిరిజనులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఎటువంటి భూ సేకరణ చేయవద్దని, అదానీకి భూములు అప్పగించవద్దని ఎన్నో రోజులుగా పోరాడుతున్నామన్నారు. ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

చెరిగిపోతున్న శుభ్రత

- వాటర్ ట్యాంకుల్లో కానరాని క్లోరినేషన్
- ట్యాంకులపై చెరిగిపోయి కనిపిస్తున్న శుభ్రత బోర్డులు
- ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షణ లోపమే దుస్థితికి కారణం
- పీడబ్ల్యూడీ తాగునీటిపై సర్వత్రా సందేహాలు



చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని మెట్టకాలనీలో 1.20 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్

చీపురుపల్లి: రక్షిత మంచినీటి పథకాలు సురక్షితమేనా..టే కాదని సాక్షాత్తూ ఆ రక్షిత మంచినీటి పథకాలకు చెందిన వాటర్ ట్యాంకులు చూస్తేనే అర్థమవుతోంది. రక్షిత మంచినీటి పథకాల వాటర్ ట్యాంకులపై శుభ్రపరిచిన తేదీలకు సంబంధించి బోర్డులు చెరిగిపోయి ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ప్రజలకు ఎంతో సురక్షితమైన తాటి అందించాలనే ఉద్దేశంతోటైన రక్షిత మంచినీటి పథకాలు ప్రస్తుతం ఎలాంటి నీటిని అందిస్తున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలకు తాగునీరు అందించే వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేసి శుభ్ర పరచాల్సిన యంత్రాంగం నిద్రావస్థలో ఉండగా, ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తున్నారో లేదో పర్యవేక్షించాల్సిన సంబంధిత శాఖ అధికారులు సైతం అటు వైపు చూడకపోవడంతో ప్రజలకు రక్షణ లేని తాగునీరు అందుతోందని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.



చెరిగిపోయి ఉన్న శుభ్రం చేసిన తేదీల బోర్డు

ప్రతినెలా క్లోరినేషన్ చేయాల్సి ఉన్నప్పటికీ..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రక్షిత మంచినీరు అందించాల్సిన వాటర్ ట్యాంకులు ప్రతీ నెలా క్లోరినేషన్ చేయాల్సి ఉందని అధికారులే చెబుతున్నారు. వందల లీటర్ల నీరు ప్రతీరోజూ నింపుకునే వాటర్ ట్యాంకు కనీసం నెలకోసారి క్లోరినేషన్ చేయకపోతే నాచు పట్టే అవకాశం ఉంది. దీంతో రక్షిత మంచినీరు కాస్త కలుషితమయ్యే ప్రమాదం ఉంది. అందుకనే ప్రతీ నెలా వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేసి అదే ట్యాంకుపై ఉన్న బోర్డులో ట్యాంకు ఎప్పుడు శుభ్రం చేసారో మళ్లీ ఎప్పుడు శుభ్రం చేయాల్సి ఉందో అనే తేదీలు వివరాలు రాయాల్సి ఉంది. కానీ ఇవేవీ జరగడం లేదు.

నెలకోసారి క్లోరినేషన్ చేయాలి

రక్షిత మంచినీటి పథకం ట్యాంకులు ప్రతీ నెలా క్లోరినేషన్ ద్వారా శుభ్రం చేయాల్సి ఉంది. ట్యాంకులు శుభ్రం చేసి ఆ ట్యాంకుపై ఉన్న బోర్డుపై తేదీలు నమోదు చేయాల్సి ఉంది. పంచాయతీ ఆధ్వర్యంలో ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉంది. రక్షిత మంచినీటి విభాగం అధికారులు పర్యవేక్షణ చేయాలి.

– శ్రీలత, డీఈఈ, రక్షిత మంచినీటి విభాగం చీపురుపల్లి డివిజన్

ట్యాంకులపై చెరిగిపోతున్న బోర్డులు

రక్షిత మంచినీటి పథకాలకు చెందిన వాటర్ ట్యాంకులపై శుభ్రపరిచిన తేదీలకు సంబంధించిన బోర్డులు చెరిగిపోతున్నాయి. అదేంటి చెరిగిపోతున్నాయా.. అనుకుంటున్నారా... చెరిగిపోవడం కాదు బహుశా చెరిపేస్తున్నారేమో అనే చర్చ కూడా జరుగుతోంది. వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేసి శుభ్ర పరిచిన తేదీలతో పాటు తిరిగి ఎప్పుడు శుభ్ర పరచాల్సి ఉందో తేదీలతో కనిపించాల్సిన బోర్డులు చెరిగిపోయి కనిపిస్తుండడం దీనికి చక్కని ఉదాహరణగా నిలుస్తోంది. ఈ విషయంలో రక్షిత మంచినీటి విభాగం అధికారులు పర్యవేక్షణ లోపం స్పష్టమవుతోంది.

జీవో నంబరు 4ను వెనక్కి తీసుకోవాలి



ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 4ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు నెల్లిమర్ల మండల కేంద్రానికి మంగళవారం వెళ్లి, తహసీల్దారు డీవీ రవిశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. సదరు జీవో ప్రకారం జనాభా ప్రాతిపదికన క్లస్టర్ విధానం తీసుకువచ్చారని, దీంతో రెండు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్ చేశారన్నారు. క్లస్టర్‌కి ఒక వీఆర్వో, ఒక సర్వేయరు కేటాయించడం వల్ల రాష్ట్రంలో 7,500 మంది వీఆర్వోలను ఏ సచివాలయానికీ కేటాయించలేదన్నారు. ఇప్పుడు సచివాలయాలు కేటాయించని వీఆర్వోలంతా ఆందోళన చెందుతున్నారన్నారన్నారు. క్లస్టర్ విధానంలోని లోపాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోతోందన్నారు. జీవో నంబరు 4ను వెనక్కి తీసుకుని, ఒక సచివాలయానికి ఒక వీఆర్వో చొప్పున కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటలక్ష్మి, సత్యవతి, రహీమా, రవి తదితరులు పాల్గొన్నారు. – నెల్లిమర్ల

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య హెచ్చరించారు. విజయనగరంలోని 35వ సచివాలయాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించి, పలు సూచనలు చేశారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరు కావాలని, ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఇంకోసారి ఎప్పుడైనా ఇలాగే అకస్మాత్తుగా తనిఖీలకు వస్తామని, ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరించినా రికార్డులు సక్రమంగా నిర్వహించకపోయినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. – విజయనగరం

ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం



ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని సీతారామస్వామి దేవస్థానం ప్రాంగణంలో కొలువైన ఆంజనేయస్వామికి మంగళవారం పంచామృతాభిషేకం చేశారు. వేకువజామున సీతారాముల వారికి ప్రాతఃకాల పూజలు చేసిన అనంతరం అదే క్షేత్రంలో ఉన్న హనుమాన్‌కు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, వివిధ రకాల ఫలరసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పఠనం చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. – నెల్లిమర్ల రూరల్

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న కల్నల్ గోపేంద్ర, సుబేదార్ మేజర్ బోడలే

విజయనగరం అర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని సీతం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు అన్నారు. స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ(నేషనల్ క్యాడెట్ కార్ప్స్) వార్షిక శిక్షణా శిబిరంలో భాగంగా రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. తొలుత కల్నల్ గోపేంద్ర, సుబేదార్ మేజర్ బోడలేలు రక్తదానం చేసి స్ఫూర్తిగా నిలవగా పలువురు ఎన్‌సీసీ క్యాడెట్లు రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానంపై ఎన్నో అపోహలు ఉన్నాయని వాటిని వీడాలన్నారు. రక్తం దానం చేస్తే సన్నగా అయిపోతాం.. ఆరోగ్యం దెబ్బతింటుందన్న అర్థరహిత మాటలను నమ్మవద్దన్నారు. రక్తదానం ఆరోగ్యమే తప్ప నష్టమేమీ లేదన్నారు. ఆరోగ్యవంతమైన వ్యక్తి ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. అలాగే యువతలో మానవతా విలువలను పెంపొందించేందుకు ఎన్‌సీసీ ప్రధాన పాత్ర పోషిస్తోందనడానికి ఇక్కడి క్యాడెట్లు చేసిన రక్తదానమే నిదర్శనమన్నారు. ఆ తర్వాత రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రామ్మూర్తి, సత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాయిదేవమణి, కెప్టెన్ ఎం.సత్యవేణి, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, లెఫ్టినెంట్ ఎస్.ప్రశాంత్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కె.సత్యనారాయణ, ఎన్‌సీసీ జిల్లా నోడల్ ఆఫీసర్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కర్లాం గ్రామంలో అంబరాన్ని తాకిన సిరిమానోత్సవం

వైభవంగా అసిరితల్లి పండగ

చీపురుపల్లి: మండలంలోని కర్లాం గ్రామంలో అసిరితల్లి అమ్మవారి గ్రామదేవత పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. దాదాపు 18 సంవత్సరాల తరువాత కర్లాం గ్రామంలో అసిరితల్లి అమ్మవారి గ్రామదేవత పండగ కావడంతో అమ్మవారి సిరిమానోత్సవం అంబరాన్ని తాకింది. గ్రామ సర్పంచ్ బానాన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ బానాన రామరత్నం, గ్రామ పెద్దలు బానాన శ్రీనివాసరావు, రమణ, రామకృష్ణ, రామారావు ఆధ్వర్యంలో పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. అలాగే ఘటోత్సవంలో భాగంగా భక్తులు దర్శనం చేసుకున్నారు.